


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 18-05-2023 సంపుటి : 04 సంచిక : 228 పేజీలు : 4 వెల : రూ 3-00

## నారా లోకేష్ యువగళం

# పాదయాత్రలో ఉద్రిక్తత



నంద్యాల మే 17 టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా టీడీపీ నేత, బోండా ఉమా మహేశ్వరరావు వియ్యంకుడు ఏవీ సుబ్బారెడ్డిపై మాజీ మంత్రి భూమా అఖిలప్రియ వర్గీయులు దాడి చేశారు. ఈ దాడిలో ఏవీ సుబ్బారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఏవీ నోటీ నుంచి రక్తం కారడం ఆయన అభిమానులు, కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తోంది. లోకేష్ పాదయాత్ర 101వ రోజుకు చేరుకుంది. నంద్యాల-ఆత్మకూరు రోడ్డులో పాదయాత్ర సాగుతుండగా.. అటు అఖిల.. ఇటు ఏవీ సుబ్బారెడ్డి తమ బలాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో ఏవీ సుబ్బారెడ్డిపై దాడి జరిగింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన సుబ్బారెడ్డి.. దమ్ముంటే డైరెక్ట్‌గా కక్ష తీర్చుకోవాలంటూ సవాల్ విసిరారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గీయులను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోనికి వచ్చింది. భూమా మరణాంతరం..! భూమా నాగిరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి ఇద్దరూ ప్రాణ స్నేహితులు. భూమా బతికున్నంత వరకూ అన్నీ తానై చూసుకున్న ఏవీ.. ఆయన మరణాంతరం ఒక్కసారిగా విబేధాలొచ్చాయి. నాటి నుంచి తాను రాజకీయాల్లోకి రావాలని ఏవీ ప్లాన్ చేసుకున్నారు. అంతేకాదు.. అయితే నంద్యాల, లేకుంటే ఆళ్లగడ్డ నుంచి పోటీచేయాలని ఏవీ ఉవ్విళ్లూరుతున్నారు. ఈ క్రమంలో అఖిల ప్రియ వర్సెస్ ఏవీగా పరిస్థితులు మారిపోయాయి. ఇప్పటి వరకూ ఈ రెండు వర్గాల మధ్య ఎన్నిసార్లు గొడవలు జరిగాయో లెక్కలేదు. ఆ మధ్య ఏవీ సుబ్బారెడ్డిపై అఖిలప్రియ భర్త నేతృత్వంలో హత్యకు ప్లాన్ చేయడాన్ని కూడా కడప జిల్లా పోలీసులు గుర్తించిన కేసులు పెట్టిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుంది. అప్పట్లో ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనమే అయ్యింది. నాటి నుంచి నేటి వరకూ ఈ రెండు వర్గాల వారు ఎక్కడ ఎదురుపడినా కొట్లాటలు.. ఎప్పుడు మీడియా ముందు కొచ్చిన మాటల తూటాలు పేలుతున్నాయి. అసలేం జరిగింది..!? రానున్న ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్న.. తనకే కచ్చితంగా టికెట్ వస్తుందన్న ధీమాతో సుబ్బారెడ్డి ఉన్నారు. ఈ విషయాన్ని లోకేష్ పాదయాత్ర ద్వారా అందరికీ తెలియజేయాలని భావించిన ఏవీ సుబ్బారెడ్డి తన బలాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నించారు. అయితే ఈ క్రమంలో ఎవరు ఎవర్ని రెచ్చగొట్టుకున్నారో.. లేకుంటే పనిగట్టుకుని మరీ ఇలా దాడిచేశారో తెలియట్లేదు కానీ.. పాదయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనపై టీడీపీ అధిష్ఠానం ఎలా రియాక్ట్ అవుతుంది..? పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎలా స్పందిస్తారు..? అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# విజయవాడలో ముగిసిన యజ్ఞం



పూర్ణాహుతిలో పాల్గొన్న సిఎం జగన్, మంత్రులు





విజయవాడ,మే17: విజయవాడలో జరుగుతున్న యజ్ఞం అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రికి పూర్ణకుంభంతో వేద పండితులు స్వాగతం పలికారు. శ్రీమహాలక్ష్మి అమ్మవా రికి సిఎం జగన్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశాఖ శ్రీశారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి, శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర స్వామి, అవధూత పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామిజీ, మంత్రులు కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణ, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషా లతో, ఆయురారోగ్య, అష్ట ఐశ్వర్యాల తో వర్ధిల్లాలని, రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలని సిఎం వైఎస్ జగన్ వేదపండితుల మంత్రోచ్ఛారణతో కూడిన సంకల్పం తీసుకొని ఆరు రోజుల క్రితం ఈ మహాయజ్ఞాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇది బుధవారం పండితులు నిర్ణయించిన ముహూర్తాన తిరిగి సిఎం జగన్ చేతుల మీదుగానే అఖండ పూర్ణాహుతితో కార్యక్రమం ముగిసింది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీ మహాలక్ష్మి యజ్ఞం మహా పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. ముఖ్యమంత్రి శ్రీ వైయస్.జగన్.సీఎం శ్రీ వైయస్.జగన్‌కు శేష వస్త్రం అందజేసి.. వేదాశీర్వచనాలతో స్వాగతం పలికిన వేదపండితులు, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ. అభిషేక మండపంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సీఎం వైయస్.జగన్ పట్టుచీర సమర్పించారు.. అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో పలువురు పీఠాధిపతులు పాల్గొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో హోంశాఖ మంత్రి తానేటి వనిత, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి దంపతులు, పలువురు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చి దిద్దుతున్నాం

### మంత్రి బొత్స సత్యనారాయణ

విజయవాడ విద్యారంగాన్ని ప్రోత్సహిస్తూ, పేదలు అధికంగా చదివే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలబడేలా చూడాలని ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని మంత్రి బోత్స సత్యనారాయణ అన్నారు. మౌలిక వసతుల కల్పన, దీర్ఘకాలిక ప్రయోజనాలు వచ్చే దిశలో అధునాతన వసతులు, మెరుగైన విద్యా బోధన తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వం. ఇంతవరకు అమలు చేసిన వినూత్నమైన, విప్లవాత్మకమైన కార్యక్రమాలకు తోడుగా ఈ సంవత్సరం నుంచి పబ్లిక్ పరీక్షల్లో (10 వతరగతి, ఇంటర్మీడియట్) అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారిని ప్రోత్సహించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామని అన్నారు. నగదు ప్రోత్సాహకం, మెరిట్ సర్టిఫికేట్ తోపాటు ఆయా విద్యార్థుల తల్లిదండ్రులను.. పాఠశాలలకు కూడా ప్రోత్సహించడం ద్వారా, ఇతర విద్యార్థుల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలన్న తపన. ఆసక్తి, పట్టుదల పెరిగేలా చూడాలన్నది ప్రభుత్వ ఆశయం. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో నిర్వహించిన 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలు సాధించిన మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యా సంస్థల విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటర్మీడియట్ స్థాయిలో ఎంపీసీ, బైపిసీ, హెచ్‌ఈసీ, మరియు సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో అగ్రస్థానాల్లో నిలిచిన వారికి ఈ మెరిట్ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించాము. అలాగే ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించి, ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాలను చేపట్టనున్నాము. పదో తరగతి స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి, ఇంటర్మీడియట్ స్థాయిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న ఒక్క విదాయర్థికి (ఒక్కో గ్రూపులో ఒక్కొక్కరికి చొప్పున) ఈ అవార్డులను అందచేయనున్నాము. విద్యాశాఖా పరంగా అంతర్గతంగా చర్చించుకున్న అనంతరం, ముఖ్యమంత్రి గారి ఆమోదంతో వీటిని అసెంబ్లీ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మూడు అంచెల్లో అందించేలా కార్యాచరణను రూపొందించామని మంత్రి వెల్లడించారు.



# జగన్ తీరుపై మండిపడ్డ పవన్ కళ్యాణ్



అమరావతి మే17 ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "పాపం పసివాడు" సినిమా పేరును ప్రస్తావిస్తూ జగన్ తీరుపై మండిపడ్డారు. నిన్న బాపట్ల మత్స్యకార సభలో పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సీఎం విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ జనసేనాని ట్వీట్ చేశారు. తనకు ఏమీ తెలియదు అన్నట్లుగా జగన్మోహన్ రెడ్డి చెప్పే వాటికే... "పాపం పసివాడు" సినిమా తీయాలంటూ పవన్ కళ్యాణ్ చురకలంటించారు. ఇంతకీ పవన్ ఏమన్నారంటే..."మన ఏపీ సీఎంతో ఎవరైనా "పాపం పసివాడు" సినిమా తీస్తారని ఆశిస్తున్నాను. అతను చాలా అమాయకుడు. ఇక్కడ ఒక చిన్న మార్పు మాత్రమే అవసరం. అతని చేతిలో 'సూట్‌కేస్'కి బదులుగా, అతని అక్రమ సంపద కోసం మనీలాండరింగ్‌ని సులభతరం చేసే బహుళ 'సూట్‌కేస్ కంపెనీలను' ఉంచండి. ప్రియమైన ఏపీ సీఎం... మీరు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య లేదా కామ్రేడ్ తరిమెల నాగి రెడ్డి కాదు. మీరు అక్రమంగా సంపాదించిన సంపదతో, ప్రజలపై విరుచుకుపడే హింసతో 'వర్గయుద్ధం' అనే పదాన్ని ఉచ్చరించే హక్కు కూడా మీకు లేదు. ఏదో ఒక రోజు 'రాయలసీమ' మీ నుంచి, మీ గుంపు బారి నుంచి విముక్తి పొందుతుందని ఆశిస్తున్నాను. పాపం పసివాడు సినిమా కథనానికి రాజస్థాన్ ఎడారి ఇసుక దిబ్బలు కావాలి, కానీ ఇసుకను ఏపీలో నది ఒడ్డున వైసీపీ దోచుకుంది. కలెక్షన్ పాయింట్లలో తగినంత ఇసుక దిబ్బలు ఉన్నాయి. చీర్స్!!" అంటూ పవన్ ట్వీట్ చేశారు. జగన్ చేసిన వ్యాఖ్యలు ఇవే...

నిన్న బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగిన మత్సకార భరోసా సభలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుకు 175 నియోజకవర్గాలలో బరిలోకి దిగే సత్తా లేదన్నారు. కనీసం 175 స్థానాల్లో చంద్రబాబు పార్టీ రెండో స్థానం కూడా వస్తుందా అని నమ్మకం కూడా చంద్రబాబుకు లేదని తెలిపారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీకి పెట్టలేని వారు ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. చంద్రబాబు పార్టీ వెంటిలేటర్‌పై ఉందని.. అందుకే దత్తపుత్రుడుని నమ్ముకున్నారన్నారు. ఇదే దత్తపుత్రుడిని జనం ఎమ్మెల్యేగా కూడా పనికిరారని ఓడించారని అన్నారు. "బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకున్నది వీళ్లే. పెళ్లి చేసుకున్నది వీళ్లే, విడాకులు ఇచ్చేది వాళ్లే.. మళ్లీ పెళ్లి చేసుకున్నది.. మళ్లీ విడాకులు ఇచ్చేది వీళ్లే. చంద్రబాబు కలిసి వెల్దాం అన్నారు. దత్తపుత్రుడు చిత్తం ప్రభు అన్నారు. చంద్రబాబుకు ఏది మంచి జరిగితే అలాగే చేస్తానని దత్తపుత్రుడు చెబుతారు. పోటీ వద్దని చెబితే అలాగే చేస్తాడు. చంద్రబాబు గాజువాక రానంటారు, దత్తపుత్రుడు మంగళగిరిలో పోటీ పెట్టకుండా ఆగుతాడు. చంద్రబాబు చెబితే బీజేపీతో దత్తపుత్రుడు తెగదెంపులు చేసుకుంటారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీల కోసం దత్తపుత్రుడు ఏం చేయటానికైనా వెనకాడరు" అంటూ జగన్ విరుచుకుపడ్డారు.

## ఏపీలో వడగాల్పులు

### అల్లాడిపోతున్న జనం

అమరావతి మే 17 ఏపీలో సూర్యుడి ప్రతాపం అంతాఇంతా కాదు. సూర్యుడి ప్రతాపం, వడగాల్పులు, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 6 గంట నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ప్రజలు రోడ్డుమీదకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. అత్యవసరమైతే తప్ప జనం రోడ్డుమీదకు రాని పరిస్థితి. ఉదయమే భానుడి భగభగలతో వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. మరోవైపు ఏపీలో ఈరోజు 20 మండలాల్లో వడగాల్పు ప్రభావం ఉందని ఏపీ విపత్తుల నిర్వాహణ సంస్థ వెల్లడించింది. అనకాపల్లి జిల్లా 2, గుంటూరు 2, కాకినాడ 1, ఎన్టీఆర్ 3, పల్నాడు 3, వైఎస్సార్ జిల్లాలో 9 మండలాల్లో వడగాల్పులు ప్రభావం ఉంటుందని, మిగిలిన చోట్ల కూడా ఎండ ప్రభావం ఉండనున్నట్లు పేర్కొంది.

# అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొచ్చు : సుప్రీం గ్రీన్ సిగ్నల్

ఢిల్లీ: అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్5 జోన్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొచ్చని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే హక్కు ప్రభుత్వానికి ఉందని బుధవారం తీర్పు వెలువరించింది. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ కె ఎం. జోసెఫ్ , జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఆర్5 జోన్‌లో పట్టాల పంపిణీపై సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ఈ క్రమంలో.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే హక్కు ప్రభుత్వానికి ఉందని బెంచ్ తీర్పు సందర్భంగా పేర్కొంది. చట్టం ప్రకారమే ఐదు శాతం ఈడబ్ల్యూఎస్‌కు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అయితే కేసు తుది ఉత్తర్వులకు లోబడే ఇళ్ల పట్టాలపై హక్కులుంటాయని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సమయంలో.. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. "34వేల ఎకరాలలో 900 ఎకరాలు మాత్రమే పేదలకు కేటాయించాం. పది మంది రైతులు మాత్రమే ఇక్కడికి వచ్చారు. సి ఆర్ డి ఎ చట్టం లోని సెక్షన్.53.1డి ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఈ పిటిషన్ కు విచారణ అర్హత లేదు అని వాదించారు. అలాగే.. ఆర్ – 5 జోన్ లో పట్టాలు ఇవ్వడాన్ని ఆపడానికి వారికి ఏ అధికారం ఉందని అభ్యంతరం వ్యక్తం చేసిన ఆయన.. ఈ – సిటీ కి ఇబ్బంది ఎలా కలుగుతుందని వాదించారు. మరోవైపు సీఆర్డీఏ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు.



# సంపాదకీయం

గురువారం 18-05-2023

## టెక్నాలజీ ప్రేమలు

ప్రపంచీకరణ పెరిగేకొద్దీ మనకు టెక్నాలజీ దగ్గర అవుతుంది. కానీ టెక్నాలజీ దగ్గరయ్యే కొద్దీ చుట్టూ ఉన్న మనుషులు దూరం అవుతున్నారు. ప్రేమను కూడా ఆన్‌లైన్‌లోనే వెతుక్కుంటున్నారు. ఈ ట్రెండ్‌ను గమనించిన ఒక స్నాప్‌చాట్ ఇన్‌ఫ్లుయెన్సర్ వినూత్నమైన ఆలోచనకు ప్రాణం పోసింది. కారిన్ మార్జోరీ అనే స్నాప్‌చాట్ ఇన్‌ఫ్లుయెన్సర్ 'కారిన్ ఏఐ' అనే ఏఐ చాట్ బోట్‌ను రూపొందించింది. ఇది వినియోగదారులకు వర్చువల్ గర్ల్‌ఫ్రెండ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించనుంది. అంటే మిమ్మల్ని ప్రేమించడానికి కూడా ఒక ఏఐ చాట్ బోట్ అవసరం అయిందన్న మాట. అయితే ఇది ఫ్రీ కాదండోయ్. నిమిషానికి ఒక డాలర్‌ను ఇది ఛార్జ్ చేయనుంది.స్నాప్‌చాట్‌లో ఇప్పటికే ఈ చాట్‌బోట్‌కు 1.8 మిలియన్ ఫాలోవర్లు ఉన్నారు. తన రూపంలోనే కారిన్ మార్జోరీ ఈ చాట్ బోట్‌ను రూపొందించింది. కారిన్ ఏఐ అచ్చం తన లాగానే కనిపించేందుకు ఎంతో శ్రమ పడింది. కొన్ని వేల గంటల వాయిస్ రికార్డులను చేసింది. స్టీవ్ జాబ్స్, టేలర్ స్విఫ్ట్ వంటి వారి ఏఐ చాట్ బోట్‌లు రూపొందించిన 'ఫరెవర్ వాయిస్' అనే కంపెనీ కారిన్ ఏఐని కూడా రూపొందించింది. ఎమోషనల్ బాండింగ్‌ను ఈ ఏఐ పంచుకోనుంది.తన ఆడియన్స్‌తో మరింత కనెక్ట్ అవ్వడానికి ఈ చాట్ బోట్ ఉపయోగపడనుందని మార్జోరీ అభిప్రాయపడింది. తనకు ప్రతి నెలా వందల మిలియన్ల వ్యూస్ వస్తున్నాయని, ప్రతి వ్యూయర్‌తో వ్యక్తిగతంగా కనెక్ట్ అవ్వడం అసాధ్యమైన పని అని తెలిపింది. క్రియేటర్‌కు, ఫాలోయర్‌కు మధ్యలో వారధిలా కారిన్ ఏఐ ఉపయోగపడుతుందని మార్జోరీ అభిప్రాయపడింది. దీనికి సంబంధించిన ప్రైవేట్ బీటా టెస్ట్ సక్సెస్ ఫుల్‌గా పూర్తయింది. మార్జోరికి ఉన్న యూజర్ బేస్‌లో 99 శాతం మంది మగవారే కావడంతో దీని ద్వారా 71,610 డాలర్ల రెవిన్యూ కూడా సమకూరింది. అంటే మనదేశ కరెన్సీలో దాదాపు రూ.59 లక్షలు అన్నమాట.మార్జోరీ అంచనాల ప్రకారం ఈ చాట్ బోట్ ద్వారా నెలకు 5 మిలియన్ డాలర్ల ఆదాయం రానుంది. మనదేశ కరెన్సీలో దాదాపు రూ.41 కోట్ల వరకు అన్నమాట. అయితే దీని ద్వారా సమాజంపై ఎంతవరకు ప్రభావం పడుతుందనే అంశం కూడా తెరపైకి వచ్చింది. తన యూజర్లపై దీని ప్రభావం ఎంత వరకు పడనుందో ఇంతవరకు మార్జోరికే ఐడియా లేదని తెలిపింది. కాబట్టి దీన్ని వినియోగించే విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఈ ఆర్టిఫిషియల్ చాట్ బోట్ల ద్వారా నిజమైన రిలేషన్ షిప్స్ మరుగున పడే అవకాశం ఉంది. వినియోగదారులు తమకు కావాల్సిన కంఫర్ట్, ప్రేమను పొందడంతో పాటు తమకు ఎదురయ్యే చేదు అనుభవాల నుంచి స్వాంతన కోరుకోవడం, నిజమైన ప్రేమ దొరక్క భ్రమల ప్రపంచంలో బతికే ప్రమాదం ఉంది. ఒకవేళ హద్దులు దాటి సెక్సువల్ సంభాషణలు ప్రారంభించి ఈ ఏఐకి అడిక్ట్ అయితే మరిన్ని తీవ్ర పరిణామాలు ఎదురుకావచ్చు.ఒక ఏఐ చాట్ బోట్‌తో ప్రేమలో పడటం అనేది మంచి సైన్స్ ఫిక్షన్ సినిమా సబ్జెక్ట్‌గా కనిపించవచ్చు. కానీ దీనికి ఎక్కువగా అలవాటు పడితే ఫిక్షన్, రియాలిటీకి మధ్య తేడాను మర్చిపోయే అవకాశం ఉంది. ఎమోషనల్‌గా కనెక్ట్ అవ్వడం కోసం ఒక చాట్ బోట్‌పై ఆధారపడటం ఏంటి? అనే ప్రశ్నలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. 'ఒక ఏఐ చాట్ బోట్ మానవ సంబంధాల్లో ఉండే లోతును, క్లిష్టతను మ్యాచ్ చేయగలదా?' అనే ప్రశ్న కూడా తెర పైకి వచ్చింది.ఎమోషనల్‌గా కలిగే రిలీఫ్‌కి, మన మానసిక ఆరోగ్యానికి నిజమైన మానవ సంబంధాలు చాలా అవసరం. ఏఐ చాట్ బోట్‌లు ఆ విషయంలో వెనకబడి ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇలా ఏఐ చాట్ బోట్‌తో సంబంధం పెట్టుకుంటే రియాలిటీకి మరింత దూరం అవుతామని అంటున్నారు. అంతే కాకుండా ఏఐ చాట్ బోట్ల ప్రైవసీ విషయంలో కూడా పలు భిన్నాభిప్రాయాలు వినపడుతున్నాయి.కారిన్ ఏఐని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో కూడా ఇటువంటి చాట్ బోట్లు మరిన్ని పుట్టుకురావచ్చు. మనిషికి, టెక్నాలజీకి మధ్య జరిగే ఇంటరాక్షన్‌లో ఇదో మైలురాయి లాంటిది. పెరుగుతున్న డిజిటైజ్డ్ ప్రపంచంలో మానవ సంబంధాల మనుగడపై ఇది ప్రశ్నలు రేకెత్తిస్తుంది.అయితే దీంతో కొన్ని ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. ఈ ఏఐ చాట్ బోట్లు తాత్కాలిక ఓదార్పును మాత్రమే అందించగలవు. నిజమైన మానవ సంబంధాల ద్వారా కలిగే స్వాంతనను ఇవి కలిగించలేవు. కానీ ఒక్కటి మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. వర్చువల్ రిలేషన్ షిప్స్ పెరుగుతున్న నేపథ్యంలో మనుషుల మధ్య ఇంటిమసీ, కనెక్షన్ల గురించి ఒకసారి పునరాలోచించుకోవడం ఎంతైనా అవసరం.

# ఏపీ బీజేపీ స్వరం మార్చుకుంటోందా ?



విజయవాడ, మే 17,పవన్ కల్యాణ్ టీడీపీతో కలిసి పని చేయాలని ప్రతిపాదన పెట్టారు. ఈ విషయాన్ని హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లాం.. పొత్తుల గురించి" వారే నిర్ణయం తీసుకుంటారని ఏపీ బీజేపీ కీలక నేతలు ప్రకటించారు. ఢిల్లీలో ఏపీ బీజేపీ తరపున వ్యవహారాలు చక్కబెట్టే జీవీఎల్ నరసింహారవు తో పాటు ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు కూడా అదే చెప్పారు. నిజానికి పొత్తులనేవి ఢిల్లీలోనే డిసైడవుతాయి. మొన్నటిదాకా ఏపీ బీజేపీ నేతలు ఇలా చెప్పలేదు. కుటుంబపార్టీలు, అవినీతి పార్టీలతో పొత్తు ప్రశ్నే లేదని చెబుతూ వస్తున్నారు. కానీ ఇప్పుడు టీడీపీతో పొత్తు విషయంపై కాస్త సాఫ్ట్ గా మాట్లాడుతున్నారు. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాజయం పాలైంది. గెలిచి ఉంటే బీజేపీకి తిరుగులేని బలం వచ్చి ఉండేదమో కానీ పరాజయం పాలవ్వడం వల్ల డీలాపడిపోయింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దక్షిణాది నుంచి సీట్లు పెంచుకోకపోతే.. ఢిల్లీలో అధికారం కూడా కష్టమవుతుంది. కనీసం ఎన్డీఏ కూటమిలో పార్టీల్ని అయినా పెంచుకోవాల్సి ఉంది. లేకపోతే ఇబ్బంది అవుతుంది. అందుకే బీజేపీ స్వరంలో మార్పులు వచ్చాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. దక్షిణాదిలో బీజేపీ సీట్లు గెల్చుకోకపోయినా సీట్లు గెలుచుకున్న పార్టీలతో పొత్తులంటే చాలని బీజేపీ అనుకునే అవకాశం ఉంద. కేరళలో బీజేపీతో పొత్తులనే మాటే ఉండదు. అక్కడ ఎవరు గెలిచినా కాంగ్రెస్ కూటమికే సీట్లు. తమిళనాడులో అన్నాడీఎంకేతో బీజేపీతో పొత్తులో ఉంది కానీ.. వచ్చే ఎన్నికల్లో సీట్లు వస్తాయన్న గ్యారంట లేదు. కర్ణాటకలో గత ఎన్నికల్లో దాదాపుగా క్లీన్ స్వీప్ చేసింది బీజేపీ. ఇంత ఘోర పరాజయం తర్వాత ఏడాదిలో సగం సీట్లు అయినా దక్కించుకోవడం కష్టమే. తెలంగాణలో కలిసి వచ్చే పార్టీలు లేవు. ఇక చాన్స్ ఉంది ఏపీలోనే. వైసీపీ బీజేపీతో సన్నిహితంగా ఉంటోంది. కానీ పొత్తులు పెట్టుకోకపోవచ్చు. ఎందుకంటే ఆ పార్టీ కోర్ ఓటు బ్యాంక్ లో ముస్లింలు కూడా ఉన్నారు. బీజేపీతో పొత్తు అంటే వారు దూరమవుతారు. అందుకే వైసీపీ అంగీకరించదు. టీడీపీకి మాత్రం గతంలో బీజేపీతో పొత్తు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి కాబట్టి సరిపోతుంది. అంటే దక్షణాదిలో బీజేపీకి దొరికే మిత్రపక్షం ఒక్క టీడీపీనే అనుకోవచ్చు. ఇప్పుడు వైసీపీ, బీజేపీ ఒక్కటేనని మేం అనడం కాదు.. ప్రజలే అనుకుంటున్నారు అని ఇటీవల ఎమ్మెల్సీగా పోటీ చేసి ఓడిపోయిన మాధవ్ మధనపడ్డారు. అచ్చెన్నాయుడు కూడా అదే చెప్పారు. పొత్తులు పెట్టుకోవాలంటే ముందు ఆ రెండు పార్టీల మధ్య గ్యాప్ ఉందన్న అభిప్రాయం రావాలన్నారు. అలాంటి అభిప్రాయం రావాలంటే కూడా ఏం చే?యాలో అచ్చెన్నాయుడే పరోక్షంగా చెప్పారు. కేంద్రం నుంచి వైసీపీ ప్రభుత్వానికి, వైసీపీ నేతలకు వ్యక్తిగతంగా అందుతున్న సాయాన్ని నిలిపివేయాలని అంటున్నారు. అంటే ప్రభుత్వానికి అడ్డగోలు అప్పులు ఆపేయడం, నిబంధనల ప్రకారం పాలించేలా చేయడం, చట్ట విరుద్ధ పనలును తక్షణం నిలిపివేసేలా చూడటం వంటివి టీడీపీ అజెండాలో ఉండవచ్చు. అవి చేస్తే బీజేపీతో పొత్తులపై ఆలోచిస్తామని టీడీపీ నేతలు చెప్పే అవకాశం ఉంది. అలాగే వ్యక్తిగత కేసుల విషయంలోనూ వైసీపీకి బీజేపీ సహకరిస్తోందన్న అభిప్రాయం ఉంది. దాన్ని కూడా మార్చాలంటు న్నారు. మొత్తంగా బీజేపీ పొత్తులపై చర్చిస్తామని చెబుతోంది .. కానీ టీడీపీ మాత్రం ఇప్పుడు తక్షణం కొన్ని ప్రయోజనాలను ఆశించే అవకాశం ఉంది.

# అర్థం కానీ జనసేన వ్యూహాలు



విజయవాడ, మే 17, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇలాంటి పరిస్థితిని గుర్తించిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఈ సారి త్రిముఖ పోటీలో జనసేనను బలి ఇవ్వకూడదని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. "శత్రువుకు అవకాశాలివ్వకుండా శత్రువును వ్యతిరేకించే వారితో జతకట్టి ప్రత్యర్థులను మట్టికరిపించడమే వివేకవంతుల విధానం. అందుకు సగౌరవంగా... వచ్చే ఎన్నికల్లో పొత్తులతో పోటీ చేస్తాం.." అని మంగళగిరిలో రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల, డివిజన్ అధ్యక్షుల సమావేశంలో ఆయన మరోసారి ఆంధ్ర ప్రజలకు స్పష్టమైన సంకేతాలు పంపించారు.గతేడాది పార్టీ ఆవిర్భావ సభ నుంచి పవన్ వ్యూహాత్మకంగా, స్థిరత్వంతో కూడిన ఆలోచన శైలితో ముందుకు సాగుతున్నారు. ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో అర్థం చేసుకొని క్షేత్ర స్థాయి పరిస్థితులకు దగ్గరగా ఆయన వ్యవహరిస్తున్నారు. రాబోయే ఎన్నికలకు మానసికంగా జనసేన పార్టీ నాయకులను, క్యాడర్‌ని సిద్ధం చేస్తున్నారు.కర్ణాటక ఎన్నికల్లో ప్రచారం చేయమని బీజేపీ కోరినా, అక్కడి పరిస్థితులను అంచనా వేసి ఆ మైలను తనకు అంటుకోకుండా పవన్ జాగ్రత్త పడ్డారు. సరిగ్గా కర్ణాటక ఫలితాల ముందురోజే వ్యూహాత్మకంగా పార్టీ మండల, డివిజన్ అధ్యక్షుల సమావేశం నిర్వహించి పార్టీ క్షేత్రస్థాయి నాయకులకు "దిశా-దశా" నిర్దేశించారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి నుండి నివేదికలు తెప్పించుకుని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసేన పార్టీ బలం, బలహీనతలపై ఒక అంచనాకు వస్తూ దానికనుగుణంగా అడుగులు ముందుకు వేస్తున్నారు.కర్ణాటకలో జేడీ(ఎస్), హైదరాబాద్‌లో ఎంఐఎం ఫోకస్ చేస్తున్నట్టుగా జనసేన కూడా ముందుగా తనకు పట్టున్న ప్రాంతలపైనే దృష్టి పెట్టాలని నిర్ణయించింది. "గత ఎన్నికల్లో జనసేనకు 7 శాతం వరకు ఓట్లు పడ్డాయని గణాంకాలు చెప్తున్నాయి. ఇప్పుడు జనసేన బలం గణనీయంగా పెరిగింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో, ఉభయ గోదావరిలో, ఉత్తరాంధ్రలో జనసేన ఓట్ల శాతం సుమారు 30 నుంచి 35 శాతం వరకు ఉంటుందని భావిస్తున్నాం. మిగతా ప్రాంతాల్లో కాస్త అటు ఇటుగా 18 శాతంగా ఉంటుంది. ఇదే బలంతో మనం అధికారంలోకి రాగలమా? లేక మరోసారి ఇలాగే మిగిలిపోదామా? అని ఆలోచించుకోవాలి" అంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షేత్రస్థాయి పరిస్థితులను పార్టీ నాయకులకు, క్యాడర్‌కి స్పష్టంగా వివరించారు.దీన్ని బట్టి చూస్తే, జనసేనాని వచ్చే ఎన్నికల్లో స్ట్రయిక్ రేట్ పెంచుకోవాలని చూస్తున్నారని అర్థమౌతోంది. ఎన్ని సీట్లలో పోటీ చేశామన్నది కాకుండా, పోటీచేసిన సీట్లల్లో ఎన్ని సీట్లు గెలుస్తామన్న దానిపై ఆయన ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఇది జనసేనానిలో వచ్చిన రాజకీయ పరిణితికి నిదర్శనం. ఎక్కువ సీట్లు పోటీచేసి ఓడిపోయేదానికన్నా పోటీచేసిన ప్రతీ సీట్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పట్టుదలతో ఆయనున్నారు. అందులో భాగంగానే ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులపై స్వతంత్ర సంస్థలతో సర్వేలు నిర్వహిస్తూ ఆయా నియోజకవర్గాలపై దృష్టిపెట్టినట్లు స్పష్టమౌతోంది. అందులో భాగంగానే మండల, డివిజన్ స్థాయి అధ్యక్షుల సమావేశంలో 40 అసెంబ్లీ స్థానాల్లో తమకు బలమున్నట్లు ఆయన స్పష్టం చేశారు.జనసేనపార్టీ మండల, డివిజన్ స్థాయి అధ్యక్ష సమావేశంలో జనసేన అధినేత ప్రధాన ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశంకు, బిజెపికి 2019 ఎన్నికలతో పోలిస్తే క్షేత్రస్థాయిలో జనసేనపార్టీ బలపడిందని, ఓట్లశాతం కూడా పెరిగిందని గట్టి సందేశాన్నే వారికి పంపారు. రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా, అరాచక వైఎస్ఆర్‌సిపి పాలన నుండి రాష్ట్రానికి విముక్తి కలిగించాలనే ఏకైక లక్ష్యంతో పొత్తులకు మొగ్గు చూపుతున్నాం తప్ప అది తమ బలహీనత కాదని, తాను బలహీనుడిని కాదనీ, గత్యంతరం లేక పొత్తు పెట్టుకోవడం లేదనే సందేశాన్ని కూడా ఈ సమావేశం ద్వారా బీజేపీ, టీడీపీలకు పంపించారు. తాము లేకుంటే ఆ పార్టీలకు గత్యంతరం లేదని, ఆత్మగౌరవం విషయంలో తాను రాజీపడబోనని కూడా పరోక్షంగా వారిని హెచ్చరించారు.

# మే 31 నుంచి తిరుచానూరు తెప్పోత్సవాలు

తిరుపతి, మే 17 ,తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలను మే 31వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించబోతున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మ సరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ ఉత్సవాల్లో అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమ పూజలు అందుకొని భక్తులను అనుగ్రహిస్తారని చెప్పారు. ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు అమ్మవారికి తెప్పోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు.పద్మ సరస్సులో బంగారు పద్మం నుంచి ఆవిర్భవించిన అలమేలు మంగ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలధిలో మునిగిపోకుండా రక్షించి, సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని పేర్కొన్నారు. మే 31వ తేదీన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి, రెండో రోజు సుందరరాజ స్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై వహరిస్తారు. ఈ క్రమంలోనే ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్ సేవలను రద్దు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరుమల పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు కావడంతో శ్రీనివాసుడి దర్శనం కోసం భక్తులు ఏడు కొండలకు క్యూ కడుతున్నారు. సోమవారం రోజున 70,366 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. ఇక స్వామి వారికి 38,653 మంది తలనీలాలు సమర్పించగా, 4.32 కోట్ల రూపాయలు భక్తులు హుండీ ద్వారా కానుకలుగా సమర్పించారు. ఇక సర్వదర్శనం భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్సులోని అన్ని కంపార్ట్మెంట్లు భక్తులతో నిండి పోయి శిలాతోరణం వరకూ భక్తులు లైన్ లో వేచి ఉన్నారు. ఇక ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు నాలుగు గంటల సమయం పడుతుంది.



ఇక క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు త్రాగునీరు, అన్నప్రసాదాలు, మజ్జికలను టీటీడీ నిరంతరాయంగా అందిస్తుంది. భక్తులు సమన్వయం పాటించి శ్రీనివాసుడి దర్శనం చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తుంది.శ్రీవారి ఆలయంలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం శ్రీ వేంకటేశ్వరుడికి కైంకర్యాలు నిర్వహిస్తున్నారు అర్చకులు. ఇందులో భాగంగా మంగళవారం ప్రత్యూషకాల ఆరాధనతో ఆలయ ద్వారముకు తెరిచిన అర్చకులు.. బంగారు వాకిలి వద్ద శ్రీ వేంకటేశ్వర సుప్రభాత స్రోతంతో స్వామి వారిని మేలు కొలిపారు. అనంతరం తోమాల, అర్చన సేవలు నిర్వహించిన అర్చకులు.. ప్రాతఃకాల ఆరాధనలో భాగంగా స్నపన మండపంలో శ్రీకొలువు శ్రీనివాసమూర్తిని వారి సమక్షంలో దర్బార్ నిర్వహించారు. శ్రీవారికి పంచాంగ శ్రవణం, హుండీ జనాకర్షణ విన్నవించి, బెల్లంతో కలిపిన నువ్వుల పిండిని స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. నవనీత హారతి సమర్పించి అనంతరం శ్రీనివాసమూర్తిని తిరిగి సన్నిధిలో వేంచేపు చేశారు.

# జేడీ లక్ష్మీనారాయణ రాజకీయ పయనం ఎటు వైపు



విశాఖపట్టణం, మే 17,సీబీఐ మాజీ జేడీ, మాజీ జనసేన నేత వీవీ లక్ష్మీనారాయణ రాజకీయం భిన్నంగా సాగుతోంది. ఆయన ఇప్పుడు ఏ పార్టీలో లేరు. కానీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం మాత్రం ఖాయమని చెబుతున్నారు. విశాఖ నుంచి పోటీ చేస్తానని ఏ పార్టీ నుంచి అన్నది మాత్రం తర్వాత చెబుతానని అంటున్నారు. ఏ పార్టీలో కుదరకపోతే ఇండిపెండెంట్ గా అయినా పోటీ చేస్తానని అంటున్నారు. ఇటీవల విశాఖలో స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై న్యాయపోరాటం కూడా చేస్తున్నారు. అందుకే ఆయన సోషల్ మీడియా ప్రకటనలు తరచూ భిన్న చర్చలకు కారణం అవుతున్నాయి. చంద్రబాబునాయుడు విజన్ ను అభినందిస్తూ.. పెద్ద నోట్ల రద్దు విషయంలో చంద్రబాబు తాజాగా చేసిన సూచనలకు మద్దతిచ్చారు. జేడీ లక్ష్మీనారాయణ చేసిన ఈ ట్వీట్ వైరల్ అయింది. టీడీపీలో చేరుతారా అన్న చర్చ ప్రారంభమయింది. అయితే ఇంతకు ముందే చుక్కల భూముల విషయంలో సీఎం జగన్ గొప్ప నిర్ణయం తీసుకున్నారని జగన్ నూ ప్రశంసించారు. అప్పుడు కూడా ఇదే చర్చ జరిగింది. వైసీపీలో చేరుతారా అని చెప్పుకున్నారు. అంతకు ముందు స్టీల్ ప్లాంట్ బిడ్‌లో పాల్గొనాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించినప్పుడు బీఆర్ఎస్ చీఫ్ పైనా ప్రశంసలు కురిపించారు. బీఆర్ఎస్ లో చేరే విషయంలో చర్చలు జరిగాయని అప్పటికే ప్రచారం జరగడంతో ఇక బీఆర్ఎస్ లో చేరడం లాంఛనమే అనుకున్నారు. కానీ అన్ని పార్టీలనూ లక్ష్మీనారాయణ పొగుడుతున్నారు కానీ..ఎవర్నీ విమర్శించడం లేదు. పవన్ కల్యాణ్ సినిమాలు చేయనని చెప్పారని.. పార్టీని వదిలేసి సినిమాలు చేస్తున్నందున తాను జనసేనకు రాజీనామా చేశానని గతంలో ప్రకటించారు.. ఇప్పుడు ఏ పార్టీలో చేరుతారో తెలియదు కానీ .. అన్ని పార్టీల నేతల్నీ ఆయన పొగుడుతున్నారు. ఆయన తెలివిగా రాజకీయం చేస్తున్నారని కొంత మంది సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు.

# ఆన్ లైన్ లో చిట్స్...

**కొత్త విధానం తెచ్చిన సర్కార్**

కాకినాడ, మే 17, (న్యూస్ పల్స్)

ఏపీలో పలు చిట్ ఫండ్స్ సంస్థలపై వరుస దాడులు చేస్తున్న ప్రభుత్వం.. అవకతవకలను గుర్తించింది. దీంతో చిట్ ఫండ్ వ్యాపారం పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. చిట్ ఫండ్ నిర్వహణకు కొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. నూతన విధానంలో ఆన్ లైన్ లోనే లావాదేవీలు సాగనున్నాయని మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రకటించారు. ఇ-చిట్స్ అనే ఎలక్ట్రానిక్ అప్లికేషన్ ను మంత్రి ప్రారంభించారు. చిట్ ఫండ్ కొత్త విధానం ప్రకారం అన్ని చిట్ ఫండ్ కంపెనీలు ఆన్ లైన్ విధానంలో మాత్రమే లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు ఏపీ రెవిన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలు ఇ-చిట్స్ అనే యాప్ రూపొందించింది. చందాదారులు ఇ- చిట్స్ ద్వారా తన డబ్బు సురక్షితంగా ఉందో లేదో సులభంగా తెలుసుకోవచ్చు. కొన్ని సంస్థలు చందాదారులను మోసం చేస్తున్నాయని, అలాంటి వాటికి అడ్డుకట్టవేసేందుకే ఈ విధానం తీసుకొచ్చినట్లు మంత్రి ధర్మాన తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లోనే చిట్స్ ను పరిశీలించి ఆమోదం తెలియజేస్తారన్నారు. ఇకపై ఈ విధానం ద్వారా మాత్రమే చిట్ లు నిర్వహించాల్సి చిట్ ఫండ్ సంస్థలను ఆదేశించారు. చిట్ సంస్థలన్నీ ఈ విధానాన్ని అమలు చేయాల్సిందేనని మంత్రి ధర్మాన స్పష్టం చేశారు.చందాదారులు మోసపోకుండా ఉండాలనే ఈ విధానం తెచ్చామని మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. ఏపీలో గత కొంత కాలంగా కొన్ని ప్రైవేట్ చిట్ సంస్థల్లో సీఐడీ సోదాలు చేస్తుంది. ఈ కేసులో కొందరిని సీఐడీ అధికారులు ఇప్పటికే ప్రశ్నించారు. చిట్ ఫండ్ విధానంలో తప్పులు జరుగున్నాయని, చందాదారుల డబ్బును ఇతర మార్గాలకు మళ్లిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఏపీ ప్రభుత్వం చిట్స్ నిర్వహణలో కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది.మరోవైపు చిట్ ఫండ్ సంస్థల్లో సోదాలు చేస్తున్న ఏపీ సీఐడీ... మార్గదర్శి వ్యవహారంలో దూకుడుగా వ్యవహరిస్తుంది. ఇప్పటికే మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ తో పాటు, ఈనాడు సంస్థల అధినేత రామోజీరావును సీఐడీ విచారించింది. మార్గదర్శిలో నిధుల మళ్లింపు జరిగిందని సీఐడీ అభియోగిస్తుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని మార్గదర్శి చిట్ ఫండ్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించడానికి ఏపీ ప్రభుత్వం ఆడిటర్‌ను నియమించింది. ఆడిటర్ నియమించడం చెల్లుబాటు కాదని మార్గదర్శి సంస్థ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై వాదనలు ఉన్న కోర్టు ఆడిటర్ నియామకంపై స్టే విధించింది.

# పల్నాడులో ఘోర రోడ్డు ప్రమాదం..

**ఆటో, లారీ ఢీ.. ఐదు గురు మృతి**

గుంటూరు ఓ ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదు గురు మరణించారు. మరో పది మందికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లాలో చోటు చేసుకుంది. క్షతగాత్రులు ప్రస్తుతం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం కోసం హాస్పిటల్ కు తరలించారు.పల్నాడు జిల్లాలోని దాచేపల్లి ప్రాంతంలో నల్గొండ జిల్లా దామరచర్ల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన 23 మంది కూలీలు ఆటోలోప్రయాణిస్తున్నారు. వీరంతా గురజాల మండలం పులిపాడుకు వెళ్తున్నారు. అయితే ఈ సమయంలో ఒక్క సారిగా లారీ వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న కూలీలందరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మరణించారు. మరో పది మందికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందడంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స కోసం స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ కు తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

# అటకెక్కిన కళ్యాణమస్తు

తిరుపతి, మే 17, టీటీడీ ప్రారంభించిన కల్యాణమస్తు పథకం ప్రారంభించిన కొద్ది రోజులకే అటకెక్కింది. నిరుపేద కుటుంబాల్లో పెళ్లి భారం కాకూడదని సదుద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో ఉచిత సామూహిక వివాహాల కార్యక్రమం తలపెట్టాలని భావించారు. భారీ ఎత్తున ప్రచారం నిర్వహించారు. చివరి నిమిషంలో విరమించుకోవడంతో భక్తులు ఒక్కసారిగా నిరుత్సాహానికి గురవుతున్నారు. యథావిధిగా కార్యక్రమాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుపేదలకు, సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్న టీటీడీ కల్యాణమస్తు కార్యక్రమాన్ని నిర్వహించకపోవటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో పెళ్లి చేసుకుంటే, దాంపత్య జీవితం సాఫీగా సాగుతుందని కలలుకన్న అనేకమంది జంటలకు టీడీడీ తీసుకున్న నిర్ణయంతో షాక్‌కు గురవుతున్నారు. నిరుపేద వధూవరులకు బంగారు తాళిబొట్టు ఇచ్చి వివాహం జరిపించేందుకు కల్యాణమస్తు కార్యక్రమాన్ని 2007లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రారంభించింది. ఆ తర్వాత ఈ వివాహ ఉత్సవ కార్యక్రమాన్ని ఆరుసార్లు నిర్వహించారు. ప్రస్తుతం పక్కన పెట్టేయడంతో పెళ్లి చేసుకోవాలనుకుంటున్న జంటలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వైసీపీ ప్రభుత్వం వచ్చాక ధర్మకర్తల మండలిలో చర్చించి కల్యాణమస్తును పునరుద్ధరించాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా ఒక గ్రాం బంగారు మంగళ సూత్రంతో పాటు వెండి మెట్టెలు, వధూవరులతోపాటు వచ్చే 20 మందికి భోజనాలు, ఇతర ఖర్చులన్నీ కలిపి జంటకు రూ.32,232 వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని 2020 నవంబరులో తీర్మానించారు. మరలా 2021 ఫిబ్రవరిలో జరిగిన సమావేశంలో చర్చించి ఒక్కో జంటకు రెండు గ్రాముల బంగారు మంగళసూత్రాలు అందించేందుకు టీడీడీ వద్దనున్న 20 వేల మంగళసూత్రాలను వినియోగించుకునేందుకు ఆమోదించారు. గత ఏడాది ఆగస్టు ఏడో తేదీన సామూహిక వివాహాలు జరపాలని నిర్ణయించారు. ముహూర్త పత్రికను శ్రీవారి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు.అర్హులైన వధూవరులు తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తు పత్రాలను పెద్ద ఎత్తున సమర్పించారు. ఆ తర్వాత టీటీడీ అధికారులు కల్యాణమస్తు ఊసే మరిచారు. యువ జంటల ఆశలు అడియాశలయ్యాయి. వస్తున్న వినతుల దృష్ట్యా అయినా తిరిగి కార్యక్రమాన్ని ప్రారంభించాలని దరఖాస్తు చేసుకున్నవారు కోరుతున్నారు

# దేవుడి సన్నిధిలో జ'గన్ ' ఏంటీ

తిరుపతి, మే 17,తిరుపతిలోని గంగమ్మ జాతరకు ఎంత ప్రాముఖ్యం ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చిత్తూరు జిల్లాలో ఒక పెద్ద పండుగలా ఆ వేడుకను ప్రజలు జరుపుకుంటారు. అయితే, ఆ ఆలయ అలంకరణ ప్రస్తుతం వివాదానికి దారి తీసింది. ఆలయం వెలుపల ద్వారానికి పూలతో చేసిన అలంకరణలో వైఎస్ఆర్ సీపీ జెండాలు కనిపించడం, ఏ అనే ఇంగ్లిషు అక్షరంతో పాటు ఓ తుపాకీ గుర్తు ఉండడంతో ఈ వ్యవహారం మరింత పెద్దది అవుతోంది. 'ఏ గన్' అని అలంకరణలో ఏర్పాటు చేయడం పిచ్చికి పరాకాష్ఠ అని విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. తాజాగా ఈ వ్యవహారంపై టీడీపీ అధినేత చంద్రబాబు స్పందించారు. అసలు 'జే' అనే అక్షరానికి గంగమ్మకు సంబంధం ఉందా? అని ప్రశ్నించారు. ఈ మేరకు చంద్రబాబు ట్వీట్ చేశారు."తిరుపతి గంగమ్మ గుడికి ఇలాంటి అలంకారమా? దేవుని సన్నిధిలో ఈ 'గన్' సంస్కృతి ఏంటి? వైసీపీ జెండా గుర్తులు ఏంటి? పిచ్చి పట్టిందా? 'ఏ' అక్షరానికి గంగమ్మకి సంబంధం ఉందా? మీ ప్రచార పిచ్చితో, అహంకారంతో దేవుళ్ళ దగ్గర ఇలాంటి వేషాలా?" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.నారా లోకేష్ కూడా అలంకరణ ఫోటోను ట్విట్టర్ లో పోస్ట్ చేసి వైసీపీ నేతల తీరును తప్పు పట్టారు. "దైవ సన్నిధిలోనూ జగన్ గ్యాంగులు తమ నేరబుద్ధిని చూపించుకుంటున్నాయి. తిరుపతి గంగమ్మ గుడి ఆవరణలో జగన్ పేరు వచ్చేలా జె అక్షరం, గన్ బొమ్మలొచ్చేలా పూలతో అలంకరించడం చూస్తే, ఎంతగా బరి తెగించారో తేటతెల్లమవుతోంది. దేవాలయాలపై గన్ బొమ్మలు వేస్తున్నారంటే, ప్రజల్నేకాదు, దేవుళ్లనీ బెదిరిస్తున్నట్టే" అని లోకేశ్ ట్వీట్ చేశారు.తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు.. చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున గంగమ్మ దర్శనంకు భక్తులు విచ్చేస్తున్నారు.. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి అనూహ్యంగా భక్తుల తాకిడీ పెరగడంతో భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డితో సమీక్షించారు.. ఐతే ఈ ఒక్క రోజే మూడు లక్షల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శనానికి విచ్చేసినట్లు అధికారులు అంచనా వేశారు.. బుధవారం తెల్లవారి జామున 1.30 గంటలకు అమ్మ వారి విశ్వరూప దర్శనం, చెంప నరుకుడు ఘట్టాలతో గంగమ్మ జాతర పరిసమాప్తం అయింది.

# హార్బర్ అభివృద్ధి డిపిఆర్ లో మార్పులు తేవాలి

విశాఖపట్నం మత్స్యకారులకు ఎంతమాత్రం ఉపయోగపడని ప్రస్తుత 152 కోట్ల ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి డిపిఆర్ లో మార్పులు చేపట్టాలని మత్స్యకార ఐక్యవేదిక కన్వీనర్ చీకటి రమేష్ డిమాండ్ చేసారు.విశాఖలో మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆక్షన్ హాల్ నే అభివృద్ధి చేయాలని, ఫ్లోటింగ్ జెట్టీలకు బదులుగా ఫింగర్ జెట్టీలనే నిర్మించి వాటిని హార్బర్ లో ప్రస్తుతం ఉన్న జెట్టీలకు అనుసంధానం చేయాలని జీరో నంబరు జెట్టీ నుంచి 11వ నెంబరు జెట్టీ వరకు మునిగిపోయిన వెస్సల్స్ ను వెంటనే బయటకు తీయాలని డిమాండ్ చేసారు.

# మత్స్యకారులను కలిసిన ఎంపి జీవిఎల్

విశాఖపట్నం విశాఖ ఫిషింగ్ హార్బర్ లో నెలకొన్న సమస్యలపై బీజేపీ ఎంపీ జీవిఎల్ నరసింహారావు దృష్టి సారించారు.ఫిషింగ్ హార్బర్ ను సందర్శించి మత్స్యకార సంఘాల నాయకులు, ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ల ప్రతినిధులను కలిసి స్వయంగా వారి సమస్యలను తెలుసుకున్నారు.ప్రభుత్వం,మత్స్యశాఖ అధికారుల కోసం ఈ ఫిషింగ్ హార్బర్ ను నిర్మించడం లేదని స్పష్టం చేసారు.మత్స్యకారుల అవసరాలకు అనుగుణంగా ఆధునీకరిస్తున్న నేపథ్యంలో అవసరమైతే డిపిఆర్ లో మార్పులు చేసేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని చెప్పారు.

# కమలంతో ముందుకా...వెనుకకా...

## టీడీపీ, జనసేన ఆచితూచి అడుగులు

విజయవాడ, మే 17, టీడీపీతో పొత్తు ఖాయమని పవన్? తేల్చిచెప్పారు. ఇతర పార్టీలతో పొత్తు లేకుండా ముందుకెళ్తే నష్టపోతామని పార్టీ మండల, డివిజన్? అధ్యక్షుల సమావేశంలో జనసేనాని కుండబద్దలు కొట్టేశారు. బీజేపీని కూడా ఒప్పిస్తాననే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటిదాకా వైసీపీ సర్కారుకు తెర వెనుక నుంచి మద్దతునిస్తున్న కాషాయ పెద్దలను తమ వైపు తిప్పుకోగలమని భావిస్తున్నారు. కర్నాటకలో బీజేపీకి వ్యతిరేక ఫలితాలు వస్తే ఈ పని తేలికవుతుందని పవన్? ఆలోచన కావొచ్చు. బీజేపీతో కలిస్తే ప్రజల నుంచి ఏమేరకు మద్దతు లభిస్తుంది.. ఆ పార్టీకి జనంలో ఉన్న వ్యతిరేకత ఎలాంటి ప్రభావం చూపిస్తుంది.. వైసీపీ, బీజేపీ ఒకటేనని టార్గెట్? చేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారనే అంశాలపై టీడీపీ, జనసేన పార్టీల్లో జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఇప్పటిదాకా కమలనాథులు టీడీపీ అంటేనే అంత ఎత్తున ఎగిరిపడుతున్నారు. వైసీపీ, టీడీపీల్లో ఏదో ఒక పార్టీని దెబ్బతీయకుండా బలపడలేమన్న ఆలోచనకు కట్టుబడి ఉన్నారు. అదే సమయంలో రెండు పార్టీల నేతలతోనూ టచ్?లో ఉంటున్నారు. ఎన్నికల నాటికి అప్పటి అంచనాను బట్టి నిర్ణయం తీసుకోవాలని బీజేపీ అగ్ర నేతలు భావిస్తున్నారు. అందుకే జనసేనను జారిపోకుండా పట్టుకొస్తున్నారు. ఇక్కడ జనసేన పరిస్థితి వేరు. రానున్న ఎన్నికల్లో కనీసం కొన్ని సీట్లయినా తెచ్చుకొని ప్రభుత్వంలో భాగం పంచుకోకుంటే పార్టీ ఉనికి కష్టమని పవన్? ఆలోచిస్తున్నారు. అందుకే ఆయన పొత్తు మీద క్లారిటీ ఇచ్చేశారు. కర్నాటకలో బీజేపీ ఓడినా టీడీపీ, జనసేనతో కలిసేదీ లేనిదీ ఎన్నికల దాకా తేల్చకపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.బీజేపీ అగ్రనేతలను ఒప్పించాలనే పట్టుదలతో పవన్? ఉండగా కాషాయ పార్టీతో కలిసి ముందుకు సాగడంపై టీడీపీ, జనసేనల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీకి తెర వెనుక కమలనాథులు సహకరించకుంటే విజయం సాధిస్తామని కొందరు అభిప్రాయపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలను పర్యవేక్షించేది కేంద్ర బలగాలు కాబట్టి ఇక్కడ పోలీసులతో వైసీపీ ఏం చేయలేదని భావిస్తున్నారు. బీజేపీ పొత్తుకు అంగీకరిస్తే వైసీపీ నేతలపై ఉన్న ఈడీ, సీబీఐ కేసులు వేగవంతమవుతాయని అనుకుంటున్నారు. వైసీపీని ఒంటరి చేయడం ద్వారా ఓడించడం తేలికవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ కారణాలరీత్యా బీజేపీతో పొత్తుకు చంద్రబాబు, పవన్? ఆసక్తి చూపిస్తున్నట్లు ఆయా పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది.మరోవైపు బీజేపీ మీద రాష్ట్ర ప్రజలు పీకల్దాకా ఆగ్రహంతో ఉన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చలేదన్న ఆక్రోశం నెలకొంది. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించకుండా తెగనమ్ముతామని కేంద్రం తెగేసి చెబుతోంది. వెనుకబడిన జిల్లాలకు బుందేల్?ఖండ్? తరహా ప్యాకేజీ ఇవ్వాలని అడిగితే ఆపాటికే ఇస్తున్న అరొకర నిధులనూ నిలిపేసింది. విశాఖ రైల్వే జోన్? గురించి అతీగతీ లేదు. పోలవరం ప్రాజెక్టుకు సవరించిన అంచనాలను ఆమోదించకుండా నానా ఇబ్బందులకు గురిచేస్తోంది. 2024 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయలేమని చేతులెత్తేసింది. విభజన చట్టంలో పొందుపరిచిన పోర్టు, కడప ఉక్కును గాలికొదిలేసింది.అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినా పెట్రోలు, డీజిల్? ధరలను 50 శాతం పెంచడంతో ప్రజలు అగ్గిలంమీద గుగ్గిలమవుతున్నారు. చివరకు నిత్యావసరాలపై కూడా జీఎస్టీ పన్నులు బాదేయడంతో జనం మండిపడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ప్రజల్లో చీలిక తెచ్చే విధంగా మత విద్వేషాలను రెచ్చగొడుతున్నదనే ఆందోళన నెలకొంది. ప్రధానంగా ముస్లిం మైనార్టీలు తీవ్ర అభద్రతాభావాన్ని ఎదుర్కొంటున్నారు. ఇంకా విద్యుత్?, అర్బన్? సంస్కరణలతో ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు మోపడాన్ని సహించలేకపోతున్నారు. బీజేపీతో ఎవరు కలిస్తే వాళ్లకు ఆ పార్టీపై వ్యతిరేకత విజయావకాశాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఇక్కడ బీజేపీని టార్గెట్ చేయకుండాకేవలం వైసీపీ మీద విమర్శలు ఎక్కుపెడితే ప్రయోజనం లేదు. రెండు పార్టీలను ఒకే గాటన కడితేనే ప్రజల నుంచి సానుకూలత ఉంటుందనే అభిప్రాయం రెండు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

# కడియం నర్సరీలకు వేసవి తాపం

## మండే ఎండలకు విలవిలలాడుతున్న మొక్కలు
## వాటి సంరక్షణకు రైతుల ఇక్కట్లు



కడియం ప్రచండ భానుడు ప్రతాపానికి దేశ వ్యాప్త ప్రసిద్ధిచెందిన కడియం నర్సరీలు అల్లాడిపోతున్నాయి. మంగళవారం రికార్డు స్థాయిలో ఈ ప్రాంతంలో 49 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. దీంతో కొన్ని మొక్కలు ఒక్కసారిగా వేడికి తలలు వాలే సాయి. వీటిని సంరక్షించుకోవడం నర్సరీ రైతులకు పెను సవాలుగా మారింది. గ్రీన్ బెల్ట్ గా ప్రసిద్ధిగాంచిన ఈ కడియం నర్సరీలు గ్రీష్మ తాపానికి కళాహీనంగా మారుతున్నాయి.కడియం మండలంతో పాటు ఆలమూరు, మండపేట, రంగంపేట తదితర మండలాలలో వేలాది ఎకరాలలో మొక్కల పెంపకం జరుగుతుంది.ప్రతి వేసవికి తప్పని పాట్లుమన ఇంట్లో పెంచుకునే పదోపరకో మొక్కలను వేసవిలో సంరక్షించుకోవడానికి ఆపసోపాలు పడిపోతుంటాము. ఎప్పటికప్పుడు నీరు అందిస్తూ వాటిని ఎంత జాగ్రత్తగా చూసుకున్నా వేడికి తట్టుకోలేక కొన్ని మొక్కలు చనిపోతుంటాయి.మరి అలాంటిది ఒక్కొక్క నర్సరీలో లక్షలాది మొక్కలు వివిధ వయస్సులలో ఉంటాయి. వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవడం ఎంత కష్టమో ఆ మొక్కలను పెంచి పోషించే రైతులకే తెలుస్తుంది. నిద్రాహారాలు మాని ఈ మొక్కలను బతికించుకోవాల్సి ఉంటుంది. ఇది ప్రతి వేసవిలోనూ రైతుల ఎదుర్కొనే ప్రధాన సమస్య. సాధారణంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని తయారైన మొక్కలను మార్చి నెలకే అమ్మకాలు పూర్తి చేస్తారు.అయితే ఈ ఏడాది అంతంతమాత్రంగానే ఎగుమతులు జరగడం వల్ల మొక్కల నిల్వలు ఎక్కువగానే ఉన్నాయని చెప్పుకోవచ్చు. ఇప్పుడు వాటిని బతికించుకోవడం ప్రతి రైతుకు సవాలుగానే మారుతుంది. ఓ పక్క విద్యుత్ కోతలు, మరో పక్క మండే ఎండలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదికాక ఈ వేసవి కూలీలు కూడా పనికి రావడానికి అంతగా మొగ్గుచూపరు. ఉదయం పూట మాత్రమే చాలామంది కూలీలు పనికి వస్తున్నారు. ఇలాంటి సమయంలో రెండు పూటలా ఈ మొక్కలకు నీరు అందించడం ఎంత కష్టమో వేరే చెప్పనవసరం లేదు. మొక్కకు మొక్కే తోడు... ముల్లును ముల్లుతోనే తీయాలనే పాత సామెత మనందరికీ గుర్తుండే ఉంటుంది. అయితే అలాంటి సామెత మాదిరిగానే నర్సరీ రైతులు కూడా ఈ వేసవి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంటారు. అది ఎలాగంటే ఖరీదైన నర్సరీ మొక్కలకు వేసవితాపం తగలకుండా వేరే మొక్కలను పెంచుతుంటారు. అవి కేవలం నీడని ఇవ్వడం తప్ప ఎందుకు పనికిరావు. అలాంటి అవిశ మొక్కలను వేసవికి ముందే నాటుతారు. అవి వేసవి సమయానికి ఏపుగా ఎదిగి కింద ఉండే మొక్కలకు నీడనిస్తాయి. ఆ నీడలో ఎండలను తట్టుకుని ఈ మొక్కలు జీవిస్తాయి. మొక్కలకు ఎంత నీరు అందించినా భగభగ మండే ఎండలను తట్టుకోలేవు. అందుకుని ఈ నీడనిచ్చే అవిశ మొక్కలను ముందు జాగ్రత్తగా రైతులు రంగంలోకి దింపుతారు. ఎండకాలం వెళ్లిపోయిన వెంటనే ఈ నీడనిచ్చే మొక్కలను తొలగిస్తారు. ఎప్పుడు కడియం నర్సరీలకు వెళ్ళినా కొత్త కొత్త అందాలతో అద్భుతంగా కనిపించే ఈ మొక్కలు ఇప్పుడు వెళ్తే కనబడవు.నీడనిచ్చే మొక్కల మధ్య బతుకుజీవుడా అంటూ కాలం గడుపుతాయి.తన అందచందాలతో మిడిసిపడే మొక్కలు ఎండవేడిని తాళలేక నీడనిచ్చే మొక్కల కింద తలదాచుకుంటాయి. ఇండోర్ మొక్కలకు ప్రత్యేక ఏర్పాట్లుఎంతో సున్నితంగా ఉండే ఇండోర్ మొక్కలకు ఈ వేసవిలో ప్రత్యేక ఏర్పాట్లు చేయక తప్పదు. ఈ మొక్కల కోసం లక్షలాది రూపాయల వ్యయంతో ఫాలీ హౌసులు, సెమీ షేడ్ నెట్ లను ఏర్పాటు చేస్తుంటారు. ఆ మొక్కలు నీడలోనే జీవించగలవు. అందుకనే గతంలో నాలుగైదు పెద్ద నర్సరీలలో మాత్రమే ఉండే ఈ ఫాలి హౌసులు ఇప్పుడు పదుల సంఖ్యలో పెరిగాయి. ఎండకు వేడిగాలులకు ఇవి ఎంతో రక్షణ కల్పిస్తాయి. అలంకరణకు వినియోగించే ఇండోర్ మొక్కల కొనుగోలు ఇటీవల పెరగడంతో నర్సరీ రైతులు కూడా వీటిని అధిక మొత్తంలో అందుబాటులో ఉంచుతున్నారు. దేశ విదేశాల నుంచి తీసుకొచ్చిన ఈ మొక్కలు కు వేసవి వేడి తగలకుండా రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపెడతారు. ఎగుమతులు, దిగుమతులకు కష్టమే నేల మీద ఉండే మొక్కలను సంరక్షించుకోవడమే వేసవిలో కష్టమవుతుంది. అలాంటిది ఇతర రాష్ట్రాల నుంచి మొక్కలు దిగుమతి చేసుకోవడం లేదా ఎగుమతి చేయడం ఎంత కష్టమో వేరే చెప్పనవసరం లేదు. సాధారణ రోజుల్లో లారీలపై చేసే లోడింగ్ మాదిరిగా కాకుండా ఎండ వేడి తగలకుండా ఆ మొక్కలపై అరటి సొరుగు ఇతర ఏర్పాట్లను రైతులు చేస్తుంటారు. ఎందుకంటే ఇలాంటి ఎండల్లో ఈ మొక్కలకు తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఎగుమతి చేస్తే అక్కడికి వెళ్ళేసరికి వాటి రూపురేఖలు మారిపోతాయి. అందుకునే తగినన్న జాగ్రత్తలతో మొక్కల ఎగుమతులు చేస్తారు.

# భూమా అఖిల ప్రియను అరెస్ట్ చేసిన నంద్యాల పోలీసులు

నంద్యాల మే 17 ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి భూమా అఖిల ప్రియను నంద్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె భర్త భార్గవ్ రామ్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. భూమా అఖిలప్రియ దంపతులను ప్రత్యేక వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంగళవారం రాత్రి టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డిపై.. అఖిల ప్రియ వర్గీయులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. నంద్యాల మండలం కొత్తపల్లి దగ్గర ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడి ఘటనపై నంద్యాల పోలీసులకు ఏవీ సుబ్బారెడ్డి ఫిర్యాదు చేయగా యాక్షన్ తీసుకున్నారు. అఖిలతో పాటు 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇవాళ ఉదయాన్నే ఆళ్లగడ్డలోని అఖిల ప్రియ ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి అరెస్ట్ చేశారు.

హత్యాయత్నం కేసులు..!

అఖిల ఆదేశాలతోనే ఏవీపై దాడి జరిగిందని అటు నంద్యాల.. ఇటు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ఏవీ సుబ్బారెడ్డి, ఆయన వర్గం.. అఖిల ప్రియతో పాటు మరికొందరిపై హత్యయత్నం కేసులు పెట్టారు. దీనిపై స్పందించిన పోలీసులు అసలేం జరిగిందని ఆరాతీసి ఇవాళ ఉదయమే అఖిలను అరెస్ట్ చేశారు. మరోవైపు ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోకుండా ఏవీ సుబ్బారెడ్డి, అఖిల ప్రియ ఇంటి వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కాగా.. అఖిల-ఏవీ వర్గాల మధ్య ఇప్పటికే పలుమార్లు గొడవలు జరిగాయి.

అసలేం జరిగింది..!?

భూమా నాగిరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి ఇద్దరూ ప్రాణ స్నేహితులు. భూమా బతికున్నంత వరకూ అన్నీ తానై చూసుకున్న ఏవీ.. ఆయన మరణాంతరం ఒక్కసారిగా విబేధాలొచ్చాయి. నాటి నుంచి తాను రాజకీయాల్లోకి రావాలని ఏవీ ప్లాన్ చేసుకున్నారు. అంతేకాదు.. అయితే నంద్యాల, లేకుంటే ఆళ్లగడ్డ నుంచి పోటీచేయాలని ఏవీ ఉవ్విళ్లూరుతున్నారు. ఈ క్రమంలో అఖిల ప్రియ వర్సెస్ ఏవీగా పరిస్థితులు మారిపోయాయి. ఇప్పటి వరకూ ఈ రెండు వర్గాల మధ్య ఎన్నిసార్లు గొడవలు జరిగాయో లెక్కలేదు. ఆ మధ్య ఏవీ సుబ్బారెడ్డిపై అఖిలప్రియ భర్త నేతృత్వంలో హత్యకు ప్లాన్ చేయడాన్ని కూడా కడప జిల్లా పోలీసులు గుర్తించిన కేసులు పెట్టిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుంది. అప్పట్లో ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనమే అయ్యింది. నాటి నుంచి నేటి వరకూ ఈ రెండు వర్గాల వారు ఎక్కడ ఎదురుపడినా కొట్లాటలు.. ఎప్పుడు మీడియా ముందుకొచ్చిన మాటల తూటాలు పేలుతున్నాయి.రానున్న ఎన్నికల్లో తనకే కచ్చితంగా టికెట్ వస్తుందన్న ధీమాతో సుబ్బారెడ్డి ఉన్నారు. ఈ విషయాన్ని లోకేష్ పాదయాత్ర ద్వారా అందరికీ తెలియజేయాలని భావించిన ఏవీ సుబ్బారెడ్డి తన బలాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నించారు. అయితే ఈ క్రమంలో ఎవరు ఎవర్ని రెచ్చగొట్టుకున్నారో.. లేకుంటే పనిగట్టుకుని మరీ ఇలా దాడిచేశారో తెలియట్లేదు కానీ.. పాదయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనపై టీడీపీ అధిష్టానం ఎలా రియాక్ట్ అవుతుంది..? అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# ఎల్ఓసి మంజూరు చేయించిన ఎమ్మెల్యే శ్రీధర్ బాబు

మంథని మంథని మండలము చిన్న ఓదాల గ్రామానికి చెందిన చిట్టవేణి లక్ష్మి కి హార్ట్ సర్జరీ సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రి లో చికిత్స పొందుతు సహాయం కొరకు మంథని శాసన సభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను సంప్రదించగా స్పందించిన ఆయన వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తనీ ఒక లక్ష రూపాయల ఎల్ఓసి మంజూరు చేయించారు. ఈ మేరకు మంథని శాసన సభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆసుపత్రి సహాయకులు నాగరాజు బుధవారం వారికి హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసి పత్రాలను అందజేశారు.

# పుష్పగిరిలో అపశృతి

## పెన్నా నదిలో మునిగి వ్యక్తి మృతి

కడప వైయస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గం వల్లూరు మండలం పుష్పగిరి క్షేత్రంలో అపశృతి జరిగింది. దైవదర్శనానికి వెళ్లి వ్యక్తి మృతి చెందాడు. ఎర్రగుంట్లకు మృతుడు పెన్నానదిలోకి దిగి మునిగిపోయాడు. అతనితో పాటు మునిగిన ఇద్దరు పిల్లలు కౌశల్ రెడ్డి(11 )తనుష్క్ రెడ్డి(15) ఇద్దరు పిల్లలను ఆలయంలో పనిచేస్తున్న రత్నం అనే వ్యక్తి కాపాడాడు.

# టీడీపీ ర్యాలీ

కాకినాడ టీడీపీ యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం 100 రోజుల పాదయాత్రకు సంఘీభావంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి వాకలపూడి అంబేద్కర్ విగ్రహం వరకు సంఘీబావయాత్ర సాగింది. ఈ పాదయాత్రకు పెద్ద ఎత్తున టీడీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగన్ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా లోకేష్ యువగళం యాత్ర చేపట్టారన్నారు. యువగళం పాదయాత్ర 100 రోజుల్లో 1250 కిలోమీటర్ల పూర్తి చేసుకుందని తెలిపారు. లోకేష్ పాదయాత్రకి ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు సృష్టించిందని.. అన్నింటినీ అధిగమించి పాదయాత్ర విజయవంతంగా సాగిస్తున్నారన్నారు. జగన్ పాదయాత్రలో కోర్టులకు వెళ్ళటానికి వారానికి రెండు సెలవులు పెట్టేవారని అన్నారు. లోకేష్ యాత్రలో కులమతాలకు అతీతంగా ప్రజలతో మమేకమవుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒక్క చాన్సు అంటూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. యువతకు ఇచ్చిన

జాబ్ క్యాలెండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తామన్నారే తప్ప ఒక్క పరిశ్రమైనా స్థాపించారా అంటూ ప్రశ్నించారు. రైతులు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. మద్యం, ఇసుక వంటి వాటిలో అధికార పార్టీ నేతలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. "కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం వెనుక ఆ రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. మన రాష్ట్రంలో కూడా వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత అదే స్థాయిలో ఉంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా.. టీడీపీ విజయం ఖాయం. ఈ నేపథ్యంలో పార్టీశ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ప్రజలు జగన్ పాలనను ముగింపు పలకటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 27,28 తేదీల్లో రాజమండ్రిలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు నిర్ణయించిన మహానాడును విజయవంతం చేయాలని కోరారు. జీవో 1ను హైకోర్టు కొట్టేయడం పై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి వెంకటరాజు బోళ్ల.కృష్ణ మోహన్ మట్ట ప్రకాష్ గౌడ్ బుంగ.సింహాద్రి గుల్లిపల్లి శ్రీనివాస్ తాతపూడి రామకృష్ణ కోటగిరి మహేంద్ర కాళ్ళ శ్రీను కాకినాడ రూరల్ నియోజకవర్గం అన్ని గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్ ను వెంటనే అరెస్ట్ చేయాలని ఏఐటీయూసీ డిమాండ్




కర్నూలు, మే 17విభారె న్యూస్ :ఢిల్లీలో మహిళ మల్ల యోధులు తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఆల్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు మరియు బిజెపి ఎంపీ బ్రిడ్జ్ భూషణ్ శరన్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలోని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ నగర అధ్యక్షులు బి వెంకటేష్ అధ్యక్షత వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి మునియప్ప రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జై లలితమ్మ సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం పాల్గొన్నారు ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జే లలితమ్మ మాట్లాడుతూ గత 20 రోజుల నుండి జాతీయ రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా మౌనంగా ఉండటం నరేంద్ర మోడీ గారికి సిగ్గుచేటని కంచె చేను మేసినట్లు రక్షకుడే భక్షకుడినట్లు తమను కాపాడి అండగా ఉండవలసిన అధ్యక్షుడె తమపై లైంగిక వేధింపులు సాగిస్తున్నారని అందులో ఏడుగురు మహిళారైజర్లు ఇందులో ఒకరు మైనారు భూషణ్ పై పోలీస్ కేసు నమోదు చేశారు కానీ కేంద్రం ఒత్తిడితో ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదు బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే కానీ ఎఫ్ఐఆర్ కాలేదు ఏప్రిల్ 23వ తేదీ నుండి ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరువాదిక ధర్నాకి ఉపక్రమించారు కొంతమంది ఇతర రంగాల అంతర్జాతీయ క్రీడాకారులు వీరికి ప్రత్యక్ష మద్దతు ప్రకటించారు ఇందులో భాగంగా ఏఐటీయూసీగా రాష్ట్ర వ్యాప్తంగా మే తొమ్మిదో తారీఖు సాకడాల ప్రదర్శన కలెక్టరేట్ల ధర్మాలు నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ రాష్ట్రం నుండి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ కేంద్రంపై మాట్లాడకపోవడం చాలా బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్నటువంటి అత్యాచారాలు గాని దాడులు గాని జరుగుతుంటే ఏ నాయకుడు కూడా పట్టించుకోకుండా బిజెపికి వత్తాసు పలుకుతున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలోభారత మహిళ రె జ్లర్స్ లైంగికంగా వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బర్తరప్ చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తావని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్ డిప్యూటీ సెక్రటరీ టి రామాంజనేయులు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సెక్రెటరీ బీసీ రెహమాన్ రేణుక కృష్ణ రాము పురుషోత్తం కోటమ్మ రంగనాయకులు విజయ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# నిరుద్యోగులను మోసం చేసిన ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి



కర్నూలు, మే 17విభారె న్యూస్ : రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మోసం చేశాడని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు విమర్శించాడు బుధవారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందించడానికి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసులు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్రలు అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర బాబు పాల్గొని మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను నమ్మి నిరుద్యోగులంతా జగన్మోహన్ రెడ్డి అధికారం చేపడితే నిరుద్యోగులకి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే మా కుటుంబాలు బాగుపడతాయని ఎన్నో ఆశలతో ఓట్లు వేసి గెలిపిస్తే తీరా అధికారం చేపట్టిన తర్వాత నాలుగు సంవత్సరాలు అవుతా ఉన్న తాను ఇచ్చిన ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ను హామీని గాలికి వదిలేసి నిరుద్యోగుల ఆశలపైన నీళ్లు చల్లారని వారు మండిపడ్డారు నాలుగు సంవత్సరాల నుండి డిఎస్సి నోటిఫికేషన్ కోసం రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది డిఎస్సి అభ్యర్థులు కుటుంబాలకు దూరంగా కోచింగ్ సెంటర్లలో డీఎస్సీ కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తూ పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ఏపీలో 54 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేసి స్కూల విలీనం వల్ల ఉపాధ్యాయ పోస్టులు కేవలం 700 మాత్రమే పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని తప్పుడు లెక్కలు చెప్పడంతో డీఎస్సీ అభ్యర్థులు నిరాశతో ఉన్నారని కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 50వేల ఉపాధ్యాయ, పి ఈ టి పోస్టులకి డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు గ్రూప్ 1,2,3,4 సంఖ్యను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

నాగేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నాలుగు సంవత్సరాల నుండి ఉద్యోగ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు అల్లాడుతున్నారని ఉద్యోగ వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని ఎస్సై కానిస్టేబుల్ ఉద్యోగాలు 20 వేల పోస్టులకి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు జగన్మోహన్ రెడ్డి ఎంతో గొప్పగా చెప్పుకుంటున్న గ్రామ సచివాలయాలో ఖాళీగా ఉన్న 20000 ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని లేనిపక్షంలో మరో సంవత్సరంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని నిరుద్యోగులు ఇంటికి సాగనంపుతారని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాముడు జిల్లా కార్యదర్శి కారుమంచి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న పిడిఎస్ యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అఖండ మహేంద్ర ఎన్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు వీరేష్ ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు లాజరస్ పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి రాజేష్ డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు మహేంద్ర ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు బాబయ్య బీసన్న ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మునిస్వామి బాలు విద్యార్థి యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# శానిటేషన్ పై అశ్రద్ధ చూపొద్దు



నంద్యాల మా ప్రతినిధి మే 17 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలో బుధవారం నాడు ఉదయం మునిసిపల్ కమిషనర్ రవిచంద్రా రెడ్డి. హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి , శానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి నారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. , మునిసిపల్ డీఇ లు శ్రీనివాస్ రెడ్డి. మదు కుమార్. జయ భారత్ రెడ్డి శానిటరీ మేస్త్రీలు, వార్డు సెక్రటరిలతో కలసి రామ నాథ్ రెడ్డి నగర్, పద్మావతీ నగర్, టెక్కె నందు శానిటేషన్, డ్రైనేజి క్లీనింగ్ పనులను పరిశీలించారు. శానిటేషన్ పై అశ్రద్ధ చూపొద్దని కమిషనర్ రవి చంద్రా రెడ్డి హెచ్చరించారు. . తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# పేదలకు జగనన్న కాలనీలలో ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించాలి

**సీపీఐ నాయకుల డిమాండ్**

నంద్యాల మా ప్రతినిధి మే 17 విభారె న్యూస్ :-నంద్యాల పట్టణంలో అధికారులు సూచించిన జగనన్న కాలనీలలో అధికార పార్టీ నాయకుల అనుచరులకు కాకుండా నిజమైన నిరుపేదలను వాలంటీర్ల ద్వారా విచారణ చేసి ఇవ్వాలని సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ సురేష్ సిపిఐ నాయకులు ఎం హబీబ్ బేగ్ సాంబశివుడు తెలిపారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ పార్టీ ఇల్లు లేని నిరుపేదలకు పక్కా ఇల్లు నిర్మించాలని చెప్పి 32 వేల ఎకరాలను సూచించిందని కానీ నంద్యాల పట్టణంలో ఇంతవరకు జగనన్న కాలనీలో పేదలకు ఇంటి స్థలం చూపలేదని ఎద్దేవా చేశారు. ఈ మధ్యనే ఎమ్మెల్యే గారు కోర్టులో స్థలం సమస్య పరిష్కారమైనదని జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మిస్తామని చెప్పడం జరిగిందని అన్నారు. . రాష్ట్ర ప్రభుత్వము జగనన్న గృహానికి 1,80,000 రూపాయలు ఇస్తామన్నారు. ఇసుక రేటు సిమెంటు రేటు స్టీల్ రేటు కంకర రేటు ఇలా అనేక ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడం జరిగిందని కనుక ఇచ్చే 1,80,000 రూపాయలు ఒక గృహానికి ఏ మాత్రం సరిపోదని అన్నారు. ఐదు లక్షల రూపాయలు ప్రకటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్ చేసిందన్నారు. . నంద్యాల పట్టణంలో ప్రభుత్వం సూచించిన మూడు ప్రాంతాలలో త్వరగా లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి మూడు సెంట్ల ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇంటికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు.. అలా జరగని పక్షంలో పట్టణంలో ఉన్న 42 వార్డులలో భారత కమ్యూనిస్టు పార్టీగా నిజమైన లబ్ధిదారులకు నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని పెద్ద ఎత్తున ఆందోళనలకు పిలుపునిస్తామని అన్నారు.




# ప్రచార బ్యానర్లు కడుతూ విద్యార్థులను మోసం చేస్తే ఖబర్దార్




కర్నూలు, మే 17విభారె న్యూస్ :కర్నూల్ నగరంలో అనేక చోట్ల ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బ్యానర్లను తొలగించి అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు వాటిని తగలబెట్టిన వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ ధర్నా కార్యక్రమానికి పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు అఖండ అధ్యక్షత వహించారు ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ అబ్దుల్లా, పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి బి మహేంద్ర బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ముఖ్యంగా నేషనల్ ఇంటర్నేషనల్ పేర్లతోటి వచ్చినటువంటి ఢిల్లీ పబ్లిక్,ఎడిఫై పబ్లిక్ స్కూల్ రవీంద్ర గ్లోబల్,శ్రీ లక్ష్మీ ఎడ్యుకేషన్, నారాయణ, శ్రీ చైతన్య ఇలా అనేక ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా హక్కు చట్టంలో పొందపరచిన విద్యని వ్యాపారం చేయకూడదని నిబంధన అందుకు సంబంధించినటువంటి ఎటువంటి ప్రచార ఆర్భాటాలు చేయకూడదన్న నిబంధనలను తుంగలో తొక్కి ప్రస్తుతం ఏ రోడ్లమీద చూసిన డమ్మీ ఫోటోలు పెట్టి బ్యానర్లు కట్టి ప్రజలను ఉద్యోగస్తులను మభ్యపెట్టి వాళ్ళ కళాశాలలో స్కూళ్లకు సంబంధించిన అనేక బ్యానర్లను కట్టి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఈ బ్యానర్లు కట్టడాలు యాడ్లు ఇవ్వడాలు విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కడం లాంటిదేనని అదేవిధంగా సంవత్సరం పొడువుగా బ్యానర్లలో అడ్మిషన్లు జరుగుచున్నవి అంటూ ఉండడం చాలా విదూరమైన విషయమని ఇవి చూస్తూ కూడా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం చాలా సిగ్గుచేటు అయిన విషయమని వారు అన్నారు అందుకొరకే విద్యా హక్కు చట్టాన్ని కాపాడుకోవడం కోసం విద్యార్థి సంఘాలుగా ఎంత దూరమైన వెళ్తామని ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు ఇలా రోడ్లమీద ఎక్కడబడితే అక్కడ విద్యాసంస్థలు కట్టిన బ్యానర్లను తొలగించి వాటిని కట్టిన విద్యాసంస్థల మీద తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు అందులో భాగంగానే ఈరోజు నగరంలోని అనేకచోట్ల కనిపించినటువంటి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎడిఫై స్కూల్ రవీంద్ర ఈ గ్లోబల్ స్కూల్ శ్రీ లక్ష్మీ ఎడ్యుకేషన్ ఇలాంటి విద్యాసంస్థలకు సంబంధించినటువంటి అనేక పోస్టర్లను

**వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, పీ డీ ఎస్ యు, ఎస్ ఎఫ్ ఐ**

తొలగించామని వాటిని కలెక్టర్ కార్యాలయం ఉందని దగ్ధం చేయడం జరిగిందని వారు అన్నారు వీటితోటే కాకుండా తక్షణమే ఎడిఫై పబ్లిక్ స్కూల్ ని తొలగించాలని వారు డిమాండ్ చేశారు వీటితోపాటు ఉన్నటువంటి స్కూళ్లల్లో కూడా ఒక్కొక్క విద్యార్థికి లక్ష రూపాయల చొప్పున వసూలు చేస్తూ సిబిఎస్ సిలబసుల పని చెబుతూ డమ్మీ పత్రాలతోటి నడుపుతున్న అడ్మిషన్లు పెట్టుకున్నా స్కూల్ లను సీజ్ చేయాలని సిబిఎస్ పర్మిషన్ కావాలి అంటే కనీసం ఐదు సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలో ఉండాలని కానీ ఇప్పుడు అడ్మిషన్లు పెట్టుకున్న ఏ ఒక్క స్కూలు కూడా ఆ నిబంధన పాటించలేదని వాటితోపాటు లక్షలు లక్షలు అంటూ డబ్బును పేపర్ల లాగా వసూలు చేస్తున్నటువంటి వ్యాపార విద్యాసంస్థలను సీజ్ చేసి విద్యను వ్యాపారం చేస్తున్నటువంటి వారిని అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాలుగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర సహాయ కార్యదర్శి నరసింహ, అబ్బు అమీర్ ,చంద్రశేఖర్ ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, మునిస్వామి నగర కోశాధికారి అశోక్ నగర నాయకులు నవనీత్, వంశీ, నాగేంద్ర పి.డి.ఎస్.యు నాయకులు రాము, దినేష్, సాయి, తదితరులు పాల్గొన్నారుప్రచార బ్యానర్లు కడుతూ విద్యార్థులను మోసం చేస్తే ఖబర్దార్ వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, పీ డీ ఎస్ యు, ఎస్ ఎఫ్ ఐ కర్నూల్ నగరంలో అనేక చోట్ల ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బ్యానర్లను తొలగించి అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు వాటిని తగలబెట్టిన వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ ధర్నా కార్యక్రమానికి పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు అఖండ అధ్యక్షత వహించారు ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ అబ్దుల్లా, పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి బి మహేంద్ర బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ముఖ్యంగా నేషనల్ ఇంటర్నేషనల్ పేర్లతోటి వచ్చినటువంటి ఢిల్లీ పబ్లిక్,ఎడిఫై పబ్లిక్ స్కూల్ రవీంద్ర గ్లోబల్,శ్రీ లక్ష్మీ ఎడ్యుకేషన్, నారాయణ, శ్రీ చైతన్య ఇలా అనేక ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా హక్కు చట్టంలో పొందపరచిన విద్యని వ్యాపారం చేయకూడదని నిబంధన అందుకు సంబంధించినటువంటి ఎటువంటి ప్రచార ఆర్భాటాలు చేయకూడదన్న నిబంధనలను తుంగలో తొక్కి ప్రస్తుతం ఏ రోడ్లమీద చూసిన డమ్మీ ఫోటోలు పెట్టి బ్యానర్లు కట్టి ప్రజలను ఉద్యోగస్తులను మభ్యపెట్టి వాళ్ళ కళాశాలలో స్కూళ్లకు సంబంధించిన అనేక బ్యానర్లను కట్టి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఈ బ్యానర్లు కట్టడాలు యాడ్లు ఇవ్వడాలు విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కడం



లాంటిదేనని అదేవిధంగా సంవత్సరం పొడువుగా బ్యానర్లలో అడ్మిషన్లు జరుగుచున్నవి అంటూ ఉండడం చాలా విదూరమైన విషయమని ఇవి చూస్తూ కూడా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం చాలా సిగ్గుచేటు అయిన విషయమని వారు అన్నారు అందుకొరకే విద్యా హక్కు చట్టాన్ని కాపాడుకోవడం కోసం విద్యార్థి సంఘాలుగా ఎంత దూరమైన వెళ్తామని ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు ఇలా రోడ్లమీద ఎక్కడబడితే అక్కడ విద్యాసంస్థలు కట్టిన బ్యానర్లను తొలగించి వాటిని కట్టిన విద్యాసంస్థల మీద తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు అందులో భాగంగానే ఈరోజు నగరంలోని అనేకచోట్ల కనిపించినటువంటి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎడిఫై స్కూల్ రవీంద్ర ఈ గ్లోబల్ స్కూల్ శ్రీ లక్ష్మీ ఎడ్యుకేషన్ ఇలాంటి విద్యాసంస్థలకు సంబంధించినటువంటి అనేక పోస్టర్లను తొలగించామని వాటిని కలెక్టర్ కార్యాలయం ఉందని దగ్ధం చేయడం జరిగిందని వారు అన్నారు వీటితోటే కాకుండా తక్షణమే ఎడిఫై పబ్లిక్ స్కూల్ ని తొలగించాలని వారు డిమాండ్ చేశారు వీటితోపాటు ఉన్నటువంటి స్కూళ్లల్లో కూడా ఒక్కొక్క విద్యార్థికి లక్ష రూపాయల చొప్పున వసూలు చేస్తూ సిబిఎస్ సిలబసుల పని చెబుతూ డమ్మీ పత్రాలతోటి నడుపుతున్న అడ్మిషన్లు పెట్టుకున్నా స్కూల్ లను సీజ్ చేయాలని సిబిఎస్ పర్మిషన్ కావాలి అంటే కనీసం ఐదు సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలో ఉండాలని కానీ ఇప్పుడు అడ్మిషన్లు పెట్టుకున్న ఏ ఒక్క స్కూలు కూడా ఆ నిబంధన పాటించలేదని వాటితోపాటు లక్షలు లక్షలు అంటూ డబ్బును పేపర్ల లాగా వసూలు చేస్తున్నటువంటి వ్యాపార విద్యాసంస్థలను సీజ్ చేసి విద్యను వ్యాపారం చేస్తున్నటువంటి వారిని అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాలుగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర సహాయ కార్యదర్శి నరసింహ, అబ్బు అమీర్ ,చంద్రశేఖర్ ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, మునిస్వామి నగర కోశాధికారి అశోక్ నగర నాయకులు నవనీత్, వంశీ, నాగేంద్ర పి.డి.ఎస్.యు నాయకులు రాము, దినేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలతో ఆర్థిక పరిస్థితి మెరుగు

**- - ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి...**



నంద్యాల మా ప్రతినిధి మే 17 విభారె న్యూస్ :-నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డ్ మాల్దారు పేటలో వార్డ్ కౌన్సిలర్ శాదిక్ భాషా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, పాల్గొని104వ రోజు కార్యక్రమం యజ్ఞంలా జరుగుతోందని అన్నారు. మా అందరి సంక్షేమం కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు ధన్యవాదాలు చెబుతున్నారని . పథకాలతో తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని ఎమ్మెల్యే శిల్ప రవి రెడ్డి ఎదుట సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. .ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 104 వరోజు రెండవ వార్డ్ మాల్దారిపేటలో నిర్వహించడం జరిగిందని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రాజకీయ పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి అందిస్తున్నామని అందుకే ప్రజల్లోకి ధైర్యంగా వెళ్తున్నామని అన్నారు. .నంద్యాల నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాభున్నిసా, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ , కౌన్సిలర్స్ సమ్మద్, తమిమ్, కోఆప్షన్ సభ్యులు సలాముల్లా, వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, రహమతుల్లా, వార్డు వైసిపి నాయకులు మాజీ కౌన్సిలర్ మూర్తుజ,తదితరులు పాల్గొన్నారు..

## బుధవారం కలెక్టర్ డా. సృజన ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి.



ఎమ్మిగనూరు మే 17 విభారె న్యూస్.కర్నూలు కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన ను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధికి మీ తోడ్పాటును అందించాలని ఆయన కోరారు.

## పెండింగ్ లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలి

**సిఐటియు నాయకుల డిమాండ్**

నంద్యాల మా ప్రతినిధి మే 17 విభారె న్యూస్ :-.మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నాయకురాలు ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ నాగరాజు సిఐటి జిల్లా సహాయ కార్యదర్శి కేఎంబి గౌస్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు రెండు నెలల పెండింగ్ వేతనాలు ఉన్నాయని వెంటనే ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు కోరారు. . మధ్యాహ్న భోజన కార్మికులు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు స్కూళ్లలో పనిచేస్తున్నారని వారి పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం వారి శ్రమ శక్తిని దోచుకుంటున్నారని వారు అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని వంట పాత్రలు ప్రభుత్వము ఇవ్వాలని అన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో గ్యాస్ సొంతంగా కొని మధ్యాహ్నం భోజనం వారికి వచ్చే అతి తక్కువ వేత నాలతో గ్యాస్ పై ఖర్చు పెడుతున్నారని వారు అన్నారు. మధ్యాహ్నం భోజన కార్మికులకు గుర్తింపు కార్డులు ప్రభుత్వం ఇవ్వాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని వారు కోరారు. నేటికీ మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఉన్నాయని వాటిని అరికట్టాలని వారి కోరారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వము మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు కోరారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190